క్లుప్తంగా

మన్యంకొండ ఉత్సవాలకు ఆర్టీసీ బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం రథోత్సవం, 25న మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి మన్యంకొండ కింద బస్టాండ్ వరకు బస్సులు నడుస్తాయని తెలిపారు. అదే విధంగా కొండ పైకి మినీపల్లె వెలుగు బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు.

ప్రారంభమైన ఉత్సవాలు

గండేడ్: జంగంరెడ్డిపల్లి, వెన్నాచేడ్ గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, అష్టోత్తరం, శకటోత్సవం, ఎదురుర్కోళ్ల, ప్రభోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. జంగంరెడ్డిపల్లిలో మొదటి రోజు శకటోత్సవం నిర్వహించారు. వెన్నాచేడ్‌లో సాయంత్రం వేంకటేశ్వరస్వామి పల్లకీ సేవ చేపట్టారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీసీరోడ్లకు భూమిపూజ

దేవరకద్ర: కొత్తకోట మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పర్యటించి సీసీ రోడ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుట్టపల్లి, రాజోలి, వెంకటగిరి, వెంకంపల్లి, పేరూర్, రేకులంపల్లి, ఇస్రంపల్లి, ముచ్చింతల్, అప్పంపల్లి, దాసరిపల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లో కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

నవాబుపేట తహసీల్దార్‌గా నాన్యనాయక్

నవాబుపేట: తహసీల్దార్‌గా నాన్యనాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీటీతోనే కార్యాలయ విధులు కొనసాగాయి. కాగా తహసీల్దార్ నాన్యనాయక్‌కు కార్యాలయ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ప్రజలు నేరుగా కార్యాలయానికి వచ్చి సమస్యలు పరిష్కారించుకోవాలని సూచించారు.

జిల్లాస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

గండేడ్: జాతీయ సైన్స్‌డే సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో గండేడ్ మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. డీఎఫ్ఎఫ్, అబ్దుల్ కలాం సైన్సు ల్యాబ్ వారు జిల్లా స్థాయిలో ఈ పరీక్షలు నిర్వహించారు. కాగా వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన యాదగిరి, ప్రవీణ్‌కుమార్‌లు ప్రథమ స్థానంలో, ఎనిమిదో తరగతికి చెందిన హర్షవర్ధన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ శ్రీనివాస్‌ల చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.

నవాబుపేట: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టులో కాకర్లపహాడ్ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. 6వ తరగతి విద్యార్థి బాలేశ్వరీ మొదటి బహుమతి, మాధురీ ద్వితీయ బహుమతి సాధించారు. 7వ తరగతి విభాగంలో జగదీశ్వరచారీ ద్వితీయ బహుమతి పొందాడు. ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలు బహుమతులు అందించారు. హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ గౌడ్ ఉన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి

దేవరకద్ర: మండల కేంద్రంలోని నర్సరీని శుక్రవారం ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్ పరిశీలించారు. సంరక్షణ చర్యలు చేపట్టడంలో జాగ్రత్తగా ఉండాలని.. నిర్లక్ష్యం వహించరాదన్నారు. వర్షాకాలం వరకు అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో రోడ్ల పక్కన, పకృతి వనాల్లో నాటిన మొక్కల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ ఈవో సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండల పరిధిలోని పల్లెమోనికాలనీ, వేపూర్ గ్రామాల్లో ఉన్న నర్సరీలను శుక్రవారం ఎంపీడీఓ యశోదమ్మ సందర్శించారు. మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఓ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

'వాసవీ' విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులను గోల్డ్ మెడల్స్ వరించాయి. పీయూ ఇటీవల ప్రకటించిన మేరకు తమ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీనివాసయ్య తెలిపారు. శుక్రవారం విద్యార్థులు దివ్య, మౌనిక, పూజను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. అకాడమిక్ డైరెక్టర్ రజినీకాంత్, ప్రిన్సిపాల్ కొండస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వరకు శుక్రవారం విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. ఇటీవల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్తంభాలను ఏర్పాటు చేయించగా.. తాజాగా తీగలను బిగించే పనులు చేయించారు.

కల్యాణం.. కమనీయం


జిల్లాకేంద్రం సింహగిరిలో నారాసింహుడి కల్యాణోత్సవం


వేడుక తిలకిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా సాగింది. వేడుకల్లో నిత్యపూజలతోపాటు ధ్వజారోహణం జరిపించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. శాలిబండ రాఘవేంద్ర భజనమండలి, పాలమూరు రాఘవేంద్రసేవాసమితి భజన మండలి ఆధ్వర్యంలో కోలాటాలు, భజనలు చేస్తూ ముందుకు సాగారు. ఆలయం సమీపంలో ఉన్న ధర్మకర్త నరహరి భీంసేనాచార్య గృహం నుంచి కళ్యాణ వస్త్రాలు, వడిబియ్యం మేళతాళాలతో సాదరంగా తీసుకువచ్చారు. తదనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య కల్యాణం నిర్వహించారు. మహిళాభక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కల్యాణోత్సవానికి ఏటా భక్తులు పెరుగుతుండటం, ఆలయం ప్రాంగణం ఇరుకుగా ఉండటం వల్ల.. మండప నిర్మాణానికి భక్తులు సహకరించాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోరారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి ఆలయం ఎదురుగా పూలతేరును వేడుక నిర్వహించారు. శనివారం రాత్రి పౌర్ణమి పురస్కరించుకుని రథోత్సవం నిర్వహించనున్నారు.

వైభవంగా నారసింహుడి కల్యాణోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సింహగిరి లోగల శ్రీ లక్ష్మీ నృసింహస్వామి 37వ బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుప్రభాత నిత్యోత్సవాలు, చతుస్థానార్చనలు, మూల మంత్ర హవనములు, పూర్ణాహుతి, అశ్వవాహన సేవ తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకను తిలకించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాయమారాధన, మూలమంత్ర హవనములు, చతుస్థానార్చనలు, పూర్ణాహుతి, గరుడసేవ నిర్వహించారు.

నేడు స్వామివారి రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. అదే విధంగా సూర్యప్రభ వాహన సేవ చేపట్టనున్నారు. 25న అష్టోత్తర శత కలశాభిషేకం, శ్రీస్వామివారి చక్రతీర్థం తదితర పూజలు నిర్వహించనున్నారు.


జడ్చర్లలో వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం


జడ్చర్లలో వేడుకకు తరలివచ్చిన భక్తులు

కొండను తవ్వి ఎలుకను పట్టారు!


సామాజిక తనిఖీలో ఈజీఎస్ సిబ్బందితో డీఆర్‌డీఓ నర్సిములు

- సామాజిక తనిఖీలో కేవలం రూ. 26,046 రికవరీ

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని 26 గ్రామపంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు గాను సామాజిక తనిఖీలో కేవలం రూ. 26,046 మాత్రమే రికవరీకి అధికారులు ఆదేశించారు. 13వ విడత సామాజిక తనిఖీలో 2022 ఏప్రిల్ 1వ నుంచి 2023 మార్చి 31వ వరకు జరిగిన పనులకు రూ. 5,94,03,086 ఖర్చు కాగా.. కేవలం రూ. 26,046 రికవరీకి ఆదేశించడం గమనార్హం. అయితే ఉపాధి హామీ అమలులో భాగంగా పనుల నిర్వహణ విషయంలో అనేక ఆరోపణలు ఉన్న నేపథ్యంలో తనిఖీలో పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయని అందరూ భావించారు. కానీ తక్కువ రికవరీ రాయడం సర్వత్రా చర్చనీయాశంగా మారింది. ఈ విషయంలో సామాజిక తనిఖీ బృందం కూడా పెదవిరించింది. కాగా అధికారులు సరైన రీతిలో స్పందించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం ఎంపీపీ సుధాశ్రీ అధ్యక్షతన చేపట్టిన తనిఖీలో వివిధ గ్రామాల్లో జరిగిన పనులు, ఖర్చు చేసిన నిధులపై డీఆర్ఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు చదివి వినిపించారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులే ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ చూస్తుండటం వల్ల పూర్తి సమాచారాన్ని బృందానికి ఇవ్వలేకపోయారని తెలుస్తోంది. డీఆర్‌డీఓ నర్సిములు మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈజీఎస్ పనుల విషయంలో కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని నిర్లక్ష్యం తగదని సూచించారు. అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఏపీడీ శ్రీపాద్, ఎంపీడీఓ కరుణశ్రీ, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి శృతి, ఎస్ఆర్‌పీ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంత్‌గాడ్గే బాబా ఆశయాలను నెరవేరుద్దాం



సంత్‌గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: అంటరానితనం నిర్మూలన కోసం కృషిచేయడంతో పాటు మూఢ నమ్మకాల బారి నుంచి సమాజాన్ని మేలుకొల్పిన గొప్ప యోధుడు కర్మయోగి సంత్‌గాడ్గే బాబా అని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం సంత్‌గాడ్గేబాబా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ సంత్‌గాడ్గేబాబా తన జీవితాంతం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి స్వచ్ఛ భారత్ కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రతి రోజు ఏదో ఒక గ్రామంలో చీపురుతో వచ్చి శుభ్రం చేసేవారని గుర్తుచేశారు. బాబా శ్రమదానం వల్ల స్వచ్ఛభారత్‌కు మూలాలు ఏర్పడ్డాయని అన్నారు. జిల్లా కోకన్వీనర్లు సవారి సత్యం, రుద్రారం సత్యం, ఆశన్న ముదిరాజ్, వివిధ సంఘాల అధ్యక్షుడలు పురుషోత్తం, మహేందర్, ధనరాజ్, నాయకులు బాలచందర్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: సంత్ గాడ్గే బాబా జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని జై భీమ్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. జ్ఞాన నీలి మెరుపు బహుజన మహనీయుల శోభాయాత్ర కమిటీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రమేష్, వెంకటస్వామి, సింగిరెడ్డి పరమేశ్వర్, శివన్న, నాగన్న, అజీమ్, శ్రీనివాస్, ఎ.శేఖర్, పవన్‌కుమార్, పాండు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మన్యంకొండ అభివృద్ధికి కృషిచేశాం


మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండలో తమ హయాంలో పూర్తిస్థాయి వసతులు కల్పించి అభివృద్ధి చేశామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. రూ. 2.50 కోట్లతో 18 ప్రత్యేక గదులు, తాగునీరు, నాలుగు లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ వంటి పనులు చేశామన్నారు. ఆలయం వద్ద హాల్ నిర్మాణించి ఉచిత పెళ్లిళ్లు చేసినట్లు వివరించారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

వేపూర్ చిన్నారెడ్డి విగ్రహావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి కన్వెన్షన్ సెంటర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాలమూరు రెడ్డిసేవా సమితి గౌరవాధ్యక్షుడు వేపూరు చిన్నారెడ్డి విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. చిన్నారెడ్డి సేవలను కొనియాడారు. సమితి అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, మల్లు నర్సింహారెడ్డి, జి.వెంకట్రాంరెడ్డి, ఎస్.సురేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మహమ్మదాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. శుక్రవారం మంగంపేట్, మంగంపేట్ తండాల్లో రూ.10లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. పీఆర్ఏఈ ముతీమ్, ఎస్టీసెల్ తాలుకా నాయకుడు సునీల్, నర్సింహారెడ్డి, దశరథ్‌గౌడ్ పాల్గొన్నారు.

29 నుంచి బ్రహ్మోత్సవాలు

భూత్పూర్: మండల కేంద్రంలో మునిరంగస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం 10 గంటలకు టెంకాయలు, తైబజార్, లడ్డు వేలం పాట నిర్వహిస్తున్నట్లు వివరించారు. టెంకాయల వేలానికి రూ.10వేలు, తైబజార్, లడ్డుకు రూ.2వేల చొప్పున చెల్లించాలని, ఆసక్తి గల వారు హాజరుకావాలని సూచించారు.

తోటయ్య సేవలు మరువలేం

జడ్చర్ల టౌన్: సేవాగుణం కలిగిన తోటయ్య లాంటివారు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అనురాగిణి అరక్షిత నిలయంలో ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఉద్యోగి తోటయ్య సంస్మరణసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తోటయ్య సేవలు మరువలేమన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మహేశ్వర్, గుండెరావు, కృష్ణయ్య, బుచ్చిలింగం, అయ్యన్న, సత్యనారాయణరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఉర్దూ అంగన్‌వాడీలు ఏర్పాటు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ఆల్ మేవా క్యాలెండర్లు, డైరీని హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ ఆవిష్కరించారు. ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్‌హుస్సేన్ నేతృత్వంలో ఈసందర్భంగా ఆయనకు అన్ని మాధ్యమ పాఠశాలల్లో ఉర్దూను రెండో ఐచ్ఛిక భాషగా ప్రవేశపెట్టాలని, ముస్లిం ఆవాస ప్రాంతాల్లో ఉర్దూ మీడియా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించాలని, బక్రీద్ పండుగ మరుసటి సాధారణ సెలవుగా ప్రకటించాలని కోరారు. వహీద్‌షా, హిదాయత్ అలీ, మహ్మద్ ఆరిఫ్, జావెద్ అహ్మద్, షబానాబేగం, యూసుఫ్‌బిన్ నాసర్, ముస్తాక్ హుస్సేన్, ఖదీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అణచివేత సరికాదు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రైతులపై కేంద్ర ప్రభుత్వ అణిచివేతను ప్రతిఒక్కరు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా నాయకుడు జి.రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డు ఎదుట రైతులతో కలిసి బ్లాక్‌డే నిర్వహించారు. డిమాండ్లు పరిష్కరించాలని శాంతియుతంగా ధర్నా కోసం వస్తున్న రైతులపై బాష్పవాయు ప్రయోగంతో పాటు కాల్పులు జరపడం సిగ్గు చేటన్నారు. ఢిల్లీ కేంద్రానికి రైతులను రానివ్వకుండా కుట్రపూరితంగా కేంద్ర వ్యవహరిస్తున్న తీరును ఖండించాలన్నారు. పోలీసుల ముసుగులో ఇతరులు దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర కార్మిక సంఘాల స్వతంత్ర సెక్టోరియల్ ఫెడరేషన్లు సంయుక్త పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. నాయకులు భరత్, వెంకటయ్య, రైతులు ఆంజనేయులు, ప్రభాకర్, వెంకట్రాములు, ఆశన్న, రాజు, మల్లేశ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు, రైతులు

సామూహిక కుంకుమార్చన

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి ప్రత్యేక అలంకారం చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి లలితా పారాయణం చేశారు. అనంతరం దేవాలయంలో వాసవీమాత పల్లకీసేవ నిర్వహించారు.


వేడుకలో పాల్గొన్న మహిళా భక్తులు

గోమాతకు ప్రత్యేక పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని శివాలయం, వీరప్పయ్యస్వామి ఆలయంలో శుక్రవారం గోమాతకు శివమాలాధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాసం అందజేశారు. అదే విధంగా ఆలయాలలో ఘనంగా పూజలు నిర్వహించారు.

శివమాలాధారులకు అన్నప్రసాద సేవ

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీశైలం వెళ్తున్న మాలాధారులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రం నాగేంద్రనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో కార్యక్రమం కొనసాగుతోంది. వచ్చేనెల 3 వరకు సేవ ఉంటుందని సమితి ప్రతినిధులు తెలిపారు.



ఎంపీడీఓకు సన్మానం



చిన్నచింతకుంట: మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డి సిద్దిపేట జిల్లాకు కొన్ని రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. కాగా శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పలువురు నాయకులు ఆయనకు శాలువాలతో సన్మానించారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, నాయకులు అశోక్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యాకూబ్, రాఘవేందర్‌రెడ్డి, జాంగీర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ ఉద్యోగుల ధర్నా

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆలిండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఆర్ఆర్‌బీఏ) పిలుపుమేరకు శుక్రవారం స్థానిక ఏనుగొండలోని ఏపీజీవీబీ రీజినల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో గ్రామీణ బ్యాంక్‌లు తమవంతు సేవలు అందిస్తున్నాయని అన్నారు. గ్రామీణ బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయాలని, దినసరి, పార్ట్‌టైమ్, క్యాజువల్ సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. ఏఐఆర్ఆర్‌బీఏ ఉపాధ్యక్షుడు జయరాం, రాజేందర్‌కుమార్, వి.నాగరాజు, నగేశ్‌తోపాటు మహబూబ్‌నగర్ రీజినల్ కార్యదర్శి కె.వీరేశ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో దోమల నివారణకు గాను ఫాగింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం 7వ వార్డులోని పద్మావతీకాలనీ, మహేంద్రహిల్స్, 8వ వార్డులోని టీచర్స్‌కాలనీ, 9వ వార్డులోని ధనలక్ష్మీకాలనీల్లో ప్రత్యేక వాహనం ద్వారా ఈ చర్యలు చేపట్టారు.

ఎట్టకేలకు వెలిగిన వీధిలైట్లు

అడ్డాకుల: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారి వద్ద సర్వీస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వీధిలైట్లు ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం వెలిగాయి. రహదారి నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వాహణ ఉండగా ఆరేడు నెలల నుంచి వీధిలైట్లు వెలగడం లేదు. వీధిలైట్ల విద్యుత్ బిల్లుల అంశంలో విద్యుత్‌శాఖ అధికారులు, రహదారి నిర్వాహకుల మధ్య విభేదాలు రాగా.. అప్పట్లో కరెంటు సరఫరాను నిలిపి వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై గతంలో పలుమార్లు పంచాయతీ నిర్వాహకులు రహదారి నిర్వాహకులను కలిసినా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దీనిపై దృష్టి సారించి సమస్య సద్దుమణిగేలా చేయడంతో ఎట్టకేలకు వీధిలైట్లు వెలిగాయి.

పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీలేదు

స్టేషన్ మహబూబ్‌నగర్: పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసేందేమిలేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎంపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాటలు సరికావన్నారు. కాంగ్రెస్ హయాంలో జూరాల బ్యాక్‌వాటర్ నీళ్లను లిఫ్ట్ చేసుకోవడానికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును రూపొందించారన్నారు. ధనార్జన కోసమే బీఆర్ఎస్ డిజైన్‌ను మార్చిందని ఆరోపించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు ఎండీ ఫయాజ్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్యనందితకు నివాళి



భూత్పూర్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎమ్మెల్యే లాస్య నందితకు శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. భూత్పూర్ చౌరస్తాలో లాస్యనందిత చిత్రపటానికి పూల మాలలు వేసి మాట్లాడారు. చిన్న వయసులోనే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమన్నారు. ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, మురళీధర్ గౌడ్, మైనార్టీ నేత మహ్మద్ సాధిక్, బోరింగ్ నర్సింహులు తదితరులు ఉన్నారు.